క్లుప్తంగా

వసూళ్లు చేస్తే చర్యలు తప్పవు



పిట్టలవానిపాలెం: స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణాలు ఇప్పించే సమయంలో యానిమేటర్లు ఎలాంటి నగదు వసూళ్లు చేయరాదని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సంతోష్ తెలిపారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో యానిమేటర్లతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో స్వయం సహాయక సంఘ సభ్యులకు బ్యాంకు రుణాలు ఇప్పించిన సమయంలో, కొత్త గ్రూపును ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కొంత నగదు తీసుకుంటున్నారనే ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. ఈ ఫిర్యాదులను విచారించి, అందుకు బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రూపుల ఆన్‌లైన్ నమోదుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీలు గాంధీ, శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

విఠలేశ్వరనగర్ ముంపు సమస్యకు పరిష్కారం



భట్టిప్రోలు: వర్షాలకు తరచూ ముంపునకు గురవుతున్న విఠలేశ్వర నగర్‌లో కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ ఈఈ మల్లికార్జునరావు తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ఆదేశానుసారం ఇరిగేషన్ శాఖాధికారులు సోమవారం ఆ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఈఈ మల్లికార్జునరావు మాట్లాడారు. మురుగు, వర్షపు నీరు పోయేందుకు ముందుగా కచ్చా డ్రెయిన్లు తీయించి, వర్షాలు తగ్గిన అనంతరం డ్రెయిన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈ దీనదయాళ్, ఏఈ కె.రవిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సురేష్, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య, కొలుసు శ్రీనివాసరరావు ఉన్నారు.

'స్పందన'కు 13 అర్జీలు



రేపల్లె: స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్డీవో జగన్నాథం పార్థసారధి పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను స్వీకరించారు. నగరం మండలం నుంచి 3, నిజాంపట్నం మండలం నుంచి 3, మున్సిపాలిటీలో సమస్యలపై 2, సర్వే సమస్యలపై 3 అర్జీలు అందగా ఇటీవల చెరుకుపల్లిలో ఉన్మాది దాడిలో మృతిచెందిన అమర్‌నాథ్ హత్య కేసులో త్వరితగతిన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఒక అర్జీ అందినట్లు ఆయన తెలిపారు. మొత్తం 13 అర్జీలను పరిశీలించి, సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది



నిజాంపట్నం: గంగపుత్రులు, అగ్నికుల క్షత్రియులు హిందూ ధర్మాన్ని అనుసరిస్తూ కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు తెలిపారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజాంపట్నం ఫిషర్‌మెన్ కాలనీలో రామాలయం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమశంకరరావు మాట్లాడారు. మత్స్య నారాయణస్వామి వారసులుగా, అగ్నికుల క్షత్రియులుగా గంగపుత్రులు ఉన్నారని తెలిపారు. అలాంటి గొప్పవంశంలో ఉన్నవారు హిందూ ధర్మాన్ని ఆచరిస్తూ ముందుకు వెళ్లాలని తెలిపారు. మండల కన్వీనర్ గౌరాశంకర్, మోపిదేవి మార్కండేయులు, కొపనాతి శ్రీనివాసరావు, బొమ్మిడి వీరభోగ వసంతరాయుడు, కొల్లాటి అమీర్ బాబు పాల్గొన్నారు.

నేడు ఆలపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆలపాడు(వేమూరు): చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం సాయంత్ర 4 గంటలకు నిర్వహించడం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గాదె శివరామకృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొని, ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు.

జగనన్నతోనే పేదల అభివృద్ధి

జగనన్న సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



పేరలిలో యువతికి రేషన్‌కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలోని పేద ప్రజల అభివృద్ధి సాధ్యమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. సోమవారం బాపట్ల పట్టణంలోని వెంగళ విహార్, దగ్గుమల్లి వారిపాలెం సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ బాపట్ల ప్రజల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలను గౌరవిస్తూ, పేదల ఇళ్లకు అధికార యంత్రాంగాన్ని పంపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. దగ్గుమల్లివారిపాలెం సచివాలయానికి మొత్తం 1,170 అర్జీలు రాగా 1,170 మందికి, వెంగల్ విహార్ సచివాలయానికి 642 దరఖాస్తులు రాగా 639 మందికి ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే కోన రఘుపతి అందజేశారు. బాపట్ల పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, జేసీఎస్ కన్వీనర్ చింతల రాజశేఖర్, పార్టీ నాయకులు సాంబార్ చెన్నకేశవులు, కానగంటి లక్ష్మీరాఘవ, మీరాబి, మున్సిపల్ సిబ్బంది, సర్వే శ్రీనివాసరావు, శివరామకృష్ణ, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలు ఘనత సీఎం వైఎస్ జగన్‌దే..

కర్లపాలెం: ఎన్నికల హామీలను 98శాతానికి పైగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపల్లి, పేరలి గ్రామ సచివాలయాల వద్ద సోమవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నికల హామీలను చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తూ వచ్చారన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు డ్వాక్రా రుణాలు, రైతులకు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని చెప్పి, చేయకుండా వారిని మోసం చేశారని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో పసుపు, కుంకుమంటూ చంద్రబాబు తమను మోసం చేసేందుకు వేసిన ఎత్తుగడను మహిళలు చిత్తు చేశారని కోన పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అసూయతో వలంటీర్ల మీద అనుచితమైన వ్యాఖ్యలు చేస్తున్నారని, ప్రజలే వీరికి సరైన గుణపాఠం చెబుతారని కోన రఘుపతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దబ్బుకూటి ఏడుకొండలు, కాగిత కరుణకుమారి, మల్లెల వెంకటేశ్వర్లు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి, మండల పరిషత్ వైస్ చైర్మన్ పందరబోయిన సుబ్బారావు, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ పెద వెంకటేశ్వర్లు, పేరలి ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ధర్మేంద్ర, తహసీల్దారు జి.కేశవనారాయణరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

కర్లపాలెం: ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష శిబిరాలను సద్వినియోగించుకోవాలని కర్లపాలెం సర్పంచ్ నక్కా లలితకుమారి, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి తెలిపారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలో సోమవారం జగనన్న సురక్ష సర్వే జరిగింది. గ్రామ సర్పంచ్ లలితకుమారి, ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి సర్వేలో పాల్గొన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన క్యాలండర్‌ను ప్రజలకు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ వివిధ ధ్రువీకరణ పత్రాలను రూపాయి ఖర్చులేకుండా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సత్వర సేవలు అందించేందుకు 'జగనన్న సురక్ష'

రేపల్లె రూరల్: ప్రభుత్వం ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు అన్నారు. పిరాట్లంక గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా 582 సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతి పాల్గొన్నారు. పేటేరు–2లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో తహసీల్దారు మల్లికార్జునరావు, మండల ఉపాధ్యక్షురాలు రావు నెహ్రూలక్ష్మి, సర్పంచ్ కనపర్తి వసుమతి, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్ 600 సర్టిఫికెట్‌లు అందజేశారు.

గడప గడపలో సంక్షేమ పథకాల వెలుగులు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి మేరుగ నాగార్జున
- అనంతవరంలో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ లబ్ధిని మహిళకు వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయడంతో గడప గడపలో వెలుగులు నిండాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. సోమవారం మండలంలోని అనంతవరంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా ఒక్కో కుటుంబం పొందిన లబ్ధిని వివరించి, కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం పథకాల పేరుతో ప్రజలను మోసగించి, తమ నాయకుల జేబులు నింపుతూ పబ్బం గడుపుకుంటే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తూ మేలు చేస్తోందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా ముందుకు తీసుకురావాలన్న తలంపుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి, ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చిన పాపాన పోలేదని మండిపడ్డారు. ఇచ్చిన హామీలకు తోడు, ప్రకటించని హామీలను సైతం అమలు చేస్తూ.. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రభుత్వంగా ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలిచిపోతుందని మంత్రి మేరుగ స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి రూ. లక్షల్లో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో మద్దతుగా నిలిచి, తిరిగి అధికారంలోకి వచ్చేలా చేస్తే ఇంతకు మించిన సంక్షేమ పథకాలను అమలు చేస్తారని, ప్రజల జీవన పరిస్థితిని మెరుగుపరుస్తారని చెప్పారు. స్థానిక ఎస్సీ శ్మశాన వాటికకు వెళ్లేందుకు మార్గం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు మంత్రి దృష్టికి తీసుకురావడంతో దారి ఏర్పాటుకు పరిష్కారం చూపుతామని సమాధానం ఇచ్చారు. స్థానిక ఎల్ఈ పాఠశాలను సందర్శించిన మంత్రి మేరుగ.. ఇంగ్లీష్ మీడియం విద్యా బోధనపై విద్యార్థులతో ముచ్చటించారు. వారి సమాధానం విని సంతృప్తి చెందారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేస్తానని, నిర్మాణ పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు అమిరిశెట్టి శ్రీధర్, సుగ్గున అశోక్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ బాజి, సర్పంచులు సనక వెంకట్రావు, గుంటూరు నీలాంబరం, గొల్లపూడి వెంకట సుబ్బారావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అయిల సుబ్బారావు, వైస్సార్ సీపీ నాయకులు దూళిపాళ్ల రాంబాబు, మేడికొండ రమేష్, చిన్నం సతీష్, దేవరపల్లి బెంజిమన్, కారుమంచి అంజనేయులు, పంతగాని విజయబాబు, తురుమెళ్ల విజయబాబు, పాముల రాము, కొలకలూరి సురేష్, వీర్ల సుజాత, చికినం శంకర్, దేవరపల్లి రజనీకాంత్, మైల ముసలయ్య, దోనేపూడి శ్రీను, సిద్ధిల ముక్తేశ్వరరావు, సిద్ధిల బసవయ్య, వీర్ల సుబ్బయ్య, మంచాల సుధీర్, శింగం కృష్ణప్రసాద్, పిల్లి బుజ్జి, గాలి నెహ్రూ, సుబ్బారెడ్డి, తోడేటి రత్నకర్, మాతంగి రత్నకుమార్, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ. సత్యనారాయణరావు, ఈఓ మణిరాజు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- నిజాంపట్నంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



నిజాంపట్నంలో స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. నిజాంపట్నంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆర్థికంగా ఆంధ్రప్రదేశ్ ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి హామీని నెరవేరుస్తున్న నాయకుడు వైఎస్ జగన్ అని కొనియాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తూ ఆదుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిజాంపట్నంలో ఇంటింటికీ వెళ్లి.. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అర్హత ఉండి పథకాలు రాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీ కోరారు. దర్వేష్‌పాలెంలో పలు ఎస్టీ కుటుంబాలు జగనన్న కాలనీలో మంజూరైన ఇళ్ల స్థలాల్లో గృహాలు నిర్మించి, ఇవ్వాలని కోరాయి. దీనిపై ఎంపీ మోపిదేవి స్పందించారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా 65 మంది ఎస్టీ కుటుంబాలకు పక్కా గృహాల నిర్మించి, ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చైతన్యానికి ప్రతీక బాపట్ల టౌన్ హాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఫోరం కార్యదర్శి, సభ్యులు

బాపట్ల అర్బన్ : బాపట్ల జీవనాడిగా, చైతన్యానికి ప్రతీకగా టౌన్‌హాల్ విరాజిల్లుతోందని, బాపట్ల పట్టణ చరిత్రకు ఇది సజీవ సాక్ష్యమని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు అన్నారు. చారిత్రిక టౌన్ హాల్ 118 వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో టౌన్ హాల్ చరిత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు ఇది పట్టుగొమ్మ అన్నారు. ఆంధ్రుల స్వరాష్ట్ర వాంఛకు ఇక్కడే బీజం పడిందని గుర్తు చేశారు. బాషా ప్రయుక్త రాష్ట్రాల వాదనకు ఇక్కడే అంకురార్పణ జరిగిందని తెలిపారు. మహాత్మా గాంధీ, చాచా నెహ్రూ వంటి ఎందరో జాతీయ నాయకులు నడయాడిన నేల అని, ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాపన సంకల్పం ఇక్కడే జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మాల్యాద్రి, అధ్యాపకులు రమణారావు, ప్రతాప్, పద్మజ, న్యూస్పేపర్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పిట్టువారిపాలెంలో 'జగనన్న సురక్ష'

పిట్టలవానిపాలెం: మండలంలోని పిట్టువారిపాలెం, గోకరాజునల్లిబోయినవారిపాలెంలో మంగళవారం, 22న కోమలి, సంగుపాలెం, కోడూరు గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీ మారుతీ శేషమాంబ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులకు 11 రకాల ధ్రువ పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి శిబిరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

నేడు ఓలేరులో 'జగనన్న సురక్ష'

భట్టిప్రోలు: మండలంలోని ఓలేరు, పెదపులివర్రు గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 రకాల సేవలకు ధ్రువీకరణ పత్రాలు అర్జీదారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

దేవాలయ అభివృద్ధికి కృషి

అత్తోట(కొల్లిపర): దేవాలయం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు అన్నారు. సోమవారం మండలంలోని అత్తోట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆయన స్వామి వారిని దర్శించుకుని విఘ్నేశ్వరపూజ, నవగ్రహ పూజ, కాలభైరవునిపూజ, పరమేశ్వరని అభిషేకం, అమ్మవారికి అష్టోత్తర కుంకుమ పూజ వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని భక్తులు, అర్చకులు, గ్రామ పెద్దలు సమష్టిగా ఉంటూ దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ దేవాలయాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. తొలుత ఆలయ చైర్మన్ దండా సాంబశివరావు, మెంబర్ చందు సాంబశివరావు, ఎంపీటీసీ బొల్లి ముంతు పోతురాజు, సర్పంచ్ నాగపుణేశ్వరరావు, ఈఓ తమ్మా శివారెడ్డి ఆలయ అర్చకులు కొల్లిపర కోటేశ్వరరావు, బాస్కరరావు కలసి అంబటి తిరుపతి రాయుడు ను మర్యాపూర్వకంగా స్వాగతం పలుకుతూ శేష వస్త్రముతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బొల్లి ముంత శంకరరావు, తుళ్లిమిల్లి రత్న మాణిక్యం, బేతపూడి మార్తమ్మ, దండా చిన్న తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసు ఎదుట డిపాజిట్‌దారుల ఆందోళన



పోస్టాఫీసు సిబ్బందిని డిపాజిట్ నగదుపై ప్రశ్నిస్తున్న బాధిత మహిళలు

కొల్లూరు : పోస్టల్ ఖాతాల్లోని తమ డిపాజిట్ నగదు గోల్‌మాల్‌కు గురైతే, ఆ నగదు తమకు తిరిగి చెల్లించడంలో పోస్టల్ శాఖ జాప్యం చేస్తోందని డిపాజిట్‌దారులు ఆందోళన బాట పట్టారు. మండలంలోని క్రాప బ్రాంచ్ పోస్టాఫీసులో పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న.. భట్టిప్రోలుకు చెందిన మురుగుడు శరత్ గత నవంబరులో ఖాతాదారులు పోస్టల్ ఖాతాల్లో జమ చేసుకున్న నగదుతో పరారయ్యాడన్న ఆరోపణలు వచ్చాయి. పోస్టల్ అధికారులు ఖాతాలు పరిశీలించి, నగదు గోల్‌మాల్ అయితే.. ఖాతాదారులకు తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డిపాజిట్లు గోల్‌మాల్‌కు పాల్పడిన పోస్టుమాస్టర్ శరత్ నుంచి నగదు వసూలు చేశామని, చెల్లింపులు జరుపుతామని ఖాతాదారులకు అధికారులు అప్పట్లోనే తెలిపారు. ఇది జరిగి తొమ్మిది నెలలు గడుస్తున్నా పోస్టల్ అధికారుల నుంచి సరైన సమాధానం లేకపోవడంతో.. సోమవారం గ్రామానికి చెందిన పలువురు ఖాతాదారులు కొల్లూరు పోస్టాఫీసుకు చేరుకుని ఆందోళన చేపట్టారు. కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి, తమ డిపాజిట్ నగదు వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న కొల్లూరు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి ఆందోళన చేస్తున్న మహిళలు, పోస్టల్ సిబ్బందితో చర్చలు జరిపారు. బాపట్ల హెడ్ పోస్టాఫీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ నెలాఖరులోపు ఖాతాదారుల నగదు చెల్లించేందుకు అధికారులు సంసిద్ధంగా ఉన్నారని తెలపడంతో డిపాజిట్ దారులు ఆందోళన విరమించారు. సీపీఐ నాయకుడు బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి



గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న బాలాజీ, ఏఐటీయూసీ నాయకులు

భట్టిప్రోలు: వృత్తి రక్షణ, సామాజిక భద్రత, సంక్షేమమే లక్ష్యంగా జూలై 21న అనంతపురంలో జరగనున్న రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ, ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యుడు బండారు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ, శ్రీనివాసరావు మాట్లాడారు. రజకులకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు. రజకులపై జరిగే దాడులను అరికట్టి సామాజిక భద్రత చట్టాన్ని తీసుకురావాలని, 50 ఏళ్లు నిండిన వారికి రూ.5 వేలు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.రఘురామ్ ప్రసాద్, వి.శ్రీనివాసరరావు, అమ్రేష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



పూర్ణచంద్రరావు (ఫైల్‌ఫోటో)

నిజాంపట్నం: గండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన మండలంలోని కూచినపూడి పంచాయతీ ఏమినేనివారిపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు..కొత్తపాలెం గ్రామానికి చెందిన దండుప్రోలు పూర్ణచంద్రరావు(44) ఏమినేని వారిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సోమవారం పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత అస్వస్థతకు గురై, ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానికులు స్పందించి పూర్ణచంద్రరావును రేపల్లెలోని ప్రైవేటు వైద్యశాలకు అంబులెన్స్‌లో తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పూర్ణచంద్రరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఝాన్సీలక్ష్మి రేపల్లెలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. పూర్ణచంద్రరావు నిజాంపట్నం ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల సోదరుడు కావడంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలి: ఆర్డీఓ



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో పార్థసారథి

రేపల్లె: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి హెచ్చరించారు. లింగ నిర్ధారణ కమిటీ నూతనంగా ఏర్పడిన సందర్భంగా స్థానిక కార్యాలయంలో సోమవారం కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగ భేదాలను రూపుమాపేందుకు ప్రభుత్వాలు పీసీ పీఎన్‌డీటీ యాక్ట్‌ను 1996లో అమల్లోకి తెచ్చాయని చెప్పారు. ఆడ శిశువులను గర్భంలోనే తీసివేస్తున్నారని, ఇటువంటి చర్యలకు పూనుకుంటే శిక్షలు తప్పవని హెచ్చరించారు. మహిళల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వాలు ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నాయన్నారు. రేపల్లె డివిజన్‌లో నూతనంగా ఏర్పడిన కమిటీలోని సభ్యులు స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలని ఆర్డీఓ కోరారు. డివిజన్ పరిధిలో 23 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ప్రతి స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని తెలుపుతూ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, డాక్టర్ సురేంద్రనాథ్, న్యాయవాది పీఎస్‌బీ శర్మ, డీఎస్పీ మురళీకృష్ణ, ఎ.ప్రభాకర్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వ సాయం అందజేత

బాధితులకు ఎంపీ మోపిదేవి రూ.40వేలు ఆర్థిక సాయం



బాధితులకు నగదు అందజేస్తున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య, సర్పంచ్

నగరం: మండలంలోని బొరమాదిగ పల్లి సచివాలయ పరిధిలోని జంగం లంక ఎస్టీ కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు సోమవారం ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య ప్రభుత్వ సాయం అందించారు. నాలుగు పూరిల్లు దగ్ధమయ్యాయని, బాధితులకు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు రూ.10,000 లెక్కన ఆర్థిక సాయంతో పాటు ప్రభుత్వ సాయం కింద రూ.5,000 ఇస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. నలుగురు బాధితులకు రూ.60,000 నగదును అందించినట్లు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ చందోలు దేవదాసు, ఉప సర్పంచ్ నల్లూరి రత్నబాబు, ఎంపీటీసీ శ్రీమన్నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు దొంతిబోయిన కొండలరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల మహా సభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బాపట్ల అర్బన్: సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల రాష్ట్ర రెండో మహా సభలను జయప్రదం చేయాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న బాపట్లలోని ఎన్జీఓ హోంలో పంచాయతీ వర్కర్స్ రాష్ట్ర రెండో మహా సభ జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని పంచాయతీ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం ఈ మహా సభలో చర్చిస్తామన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీ వర్కర్స్‌కు కొన్నినెలలుగా జీతాలు పెండింగ్ ఉన్నాయన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని, గ్రామ పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పంచాయతీ వర్కర్స్ సమస్యలపై రాబోయే కాలంలో ఉద్యమం చేయడానికి మహా సభలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సభలో రాష్ట్ర నాయకులు పాల్గొంటారని చెప్పారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

భట్టిప్రోలు: అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో భట్టిప్రోలు సెక్టార్‌లోని బట్టువారి వీధిలో అంగన్‌వాడీ సహాయకురాలి(ఆయా) పోస్టు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారాణి బి.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి ఉత్తీర్ణులై, గ్రామ వాసి అయిన 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్లలోపు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. గౌరవ వేతనం కింద రూ.7 వేలు అందించబడుతుందని, పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 22వ తేదీలోగా అమృతలూరు ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని వివరించారు.